GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

Spot Speed NEWS

T MEDIA

న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ

APGVB రోడ్, మామిళ్ళగూడెం, ఖమ్మం. సెల్ : 8919710365

మా సేవలు : ఉపన్యాసాలకు పాయింట్లు, ప్రెస్ నోట్స్, ప్రత్యేక సంచికలు, యాడ్ డిజైన్స్, పేజ్ మేకింగ్

Please Subscribe : tmedia.net.in

సంపుటి : 6 | సంచిక : 251 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 02-05-2024 | పేజీలు : 3

# యూపీలో దళితులపైనే అందరి చూపులు..

## -గెలుపు కోసం పార్టీల పాట్లు




**టీ మీడియా, మే 1,ప్రత్యేక ప్రతినిధి:**ఎన్నికల వేళ సమాజంలో కులాలు, మతాలు.. వివిధ నియోజకవర్గాల్లో వారి సంఖ్యాబలం, ఓటుబ్యాంకు వంటి సమీకరణాలు బయటికొస్తాయి. దేశాన్ని పాలించే ప్రధాన మంత్రులను అందిస్తున్న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఈ కుల, మత సమీకరణాలకు అన్ని రాజకీయ పార్టీలు పెద్ద పీట వేస్తాయి. ఎందుకంటే ఓటర్ల వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, విచక్షణ కంటే కులం, మతం ఆధారంగా పార్టీలకు ఓట్లు పడుతుంటాయి. అందుకే ఇక్కడ కులానికొక పార్టీ అన్న చందంగా బలమైన ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించాయి. జాతీయ పార్టీలు సైతం ఈ రాష్ట్రంలో గెలుపొందాలంటే కుల, మత సమీకరణాలు బేరీజు వేసుకోక తప్పదు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో గంపగుత్తగా ఓట్లు వేసే సమూహాలుగా దళితులు, ముస్లిం వర్గాలున్నాయి. వారిలో దళితులు రాష్ట్ర జనాభాలో 21.1 శాతం ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 4 దశాబ్దాల పాటు ఈ వర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. 1984లో కాన్షీరాం బహుజన్ సమాజ్ పార్టీ ని స్థాపించిన తర్వాత క్రమక్రమంగా ఈ వర్గం బీఎస్పీకి దగ్గరైంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలు అన్నింటినీ కలిపి బహుజనులుగా సంబోధిస్తూ.. వారి సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఏర్పాటైన ఈ పార్టీని దళితులు పూర్తిగా సొంతం చేసుకున్నారు. అయితే ఇప్పుడు బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో మాదిరిగా రాజకీయాల్లో క్రియాశీలంగా లేకపోవడం, గత దశాబ్దకాలంలో ఏ ఎన్నికల్లోనూ చెప్పుకోదగిన రీతిలో విజయాలు సాధించలేకపోవడం వంటి కారణాలతో దళితులు మరో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆజాద్ సమాజ్ పార్టీ పేరుతో చంద్రశేఖర్ ఆజాద్ దళిత ఓటుబ్యాంకును ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. దళిత సమాజానికి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అవతరించలేకపోయారు. ఫలితంగా భారతీయ జనతా పార్టీ దళిత ఓటుబ్యాంకులోకి చొచ్చుకెళ్లేందుకు ఆస్కారం ఏర్పడింది. 2019 ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్రీయ లోక్‌దళ్ కలసికట్టుగా పోటీచేసినా సరే బీజేపీ జైత్రయాత్రను నిలువరించలేకపోవడం వెనుక దళిత ఓటు కూడా కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో 17 సీట్లు ఎస్సీలకు రిజర్వు చేసి ఉన్నాయి. వీటిలో 15 సీట్లను బీజేపీ కైవసం చేసుకోగా, మూడు పార్టీల కూటమి కేవలం 2 సీట్లలో మాత్రమే గెలుపొందడం ఇందుకు నిదర్శనంగా భావించవచ్చు.

### ఆ 40 సీట్లలో ప్రతి నలుగురిలో ఒకరు దళితుడే.!

యూపీలో దళితులకు రిజర్వు చేసిన స్థానాలు 17 మాత్రమే ఉన్నప్పటికీ.. రాష్ట్రంలోని కనీసం 35 నుంచి 40 స్థానాల్లో వారి సంఖ్యాబలం 25 శాతం కంటే ఎక్కువగా ఉంది. అంటే ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు దళితుడేనని స్పష్టమవుతుంది. దాన్నిబట్టే ఎన్నికల్లో ఈ వర్గం చూపించే ప్రభావం ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పార్టీల జయాపజయాలను శాసించే స్థాయిలో దళితులున్న నియోజకవర్గాల్లో ఖీరి, సహారన్‌పూర్, అలీగఢ్, ఎటావా, హత్రాస్, బాందా, హమీర్‌పూర్, ఝాన్సీ, అక్బర్‌పూర్, సీతాపూర్, హర్దోయ్, మోహన్‌లాల్‌గంజ్, ఉన్నావ్, రాయ్‌బరేలి, ఫైజాబాద్, ఇలాహాబాద్, ఆగ్రా, బారాబంకీ, మిస్రిక్, బిజ్నోర్, నగీనా, లాల్‌గంజ్ వంటివి ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలవాలన్నా దళితుల మద్దతు కూడగట్టుకోవాలి.. లేదంటే దళితేర వర్గాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి వారి మద్దతుతో గెలవాల్సి ఉంటుంది. అది ఏ పార్టీకి సాధ్యం కాదు కాబట్టి అతిపెద్ద సమూహంగా ఉన్న దళితులను ఆకట్టుకునే పనిలో అన్ని పార్టీలు పడ్డాయి.

### ఏ పార్టీ ఏం చేస్తుందంటే..?

గత 4 దశాబ్దాలుగా తమకు దూరమైన దళితులను మళ్లీ దరిచేర్చుకుని పూర్వవైభవం సాధించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ 'దళిత్ గౌరవ్ సంవాద్ యాత్ర' చేపట్టారు. బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి (అక్టోబర్ 9)న చేపట్టిన ఈ యాత్రతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దళిత్ పంచాయితీలను నిర్వహిస్తూ ఆ వర్గం ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మరోవైపు బీఎస్పీని బీజేపీకి బీ-టీమ్‌గా పేర్కొంటూ వారిని మాయావతి నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తోంది.





## నిజాంలకు, రజాకార్లకు పట్టిన గతే బీజేపీకి పడుతుంది

### -నాపై పగబట్టి ఢిల్లీలో కేసు పెట్టారు - తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా, మే1, కోరుట్ల:**ప్రధాని మోదీ, బీజేపీపై నిప్పులు చెరిగారు సీఎం రేవంత్ రెడ్డి. ఆధిపత్యం చలాయించి భయపెడతామంటే నిజాంలకు, రజాకార్లకు పట్టిన గతే బీజేపీకి పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కేసులకు భయపడేటోడు కాదని తేల్చి చెప్పారు. నాకు మద్దతుగా తెలంగాణప్రజలు ఉన్నారన్నారు. బుధవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన జనజాతర సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రజల అండతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. బలహీనవర్గాలకు దక్కాల్సిన అవకాశాలు, నిధులు అందలేదన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ఇప్పుడు జరుగుతున్న లోక్ సభ ఎన్నికలు గతం కంటే భిన్నమైనవన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ, ఆరెస్సెస్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో 400 సీట్లలో గెలిచి దేశాన్ని అమ్మేయాలని బీజేపీ చూస్తోందన్నారు. రిజర్వేషన్లను రద్దు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎటు వెళ్లాలి? అని ప్రశ్నించారు. ఇదే అంశాన్ని తాను ప్రశ్నించినందుకు పోలీసులతో నోటీసులు ఇప్పించారన్నారు. నరేంద్ర మోడీ గుజరాత్ వ్యక్తిలా వచ్చి మనల్ని తిట్టారని%ొ% శపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు రోజుల్లో ఇస్తామన్న పసుపు బోర్డు ఐదేళ్లయినా ఇవ్వలేదని విమర్శించారు.పదేళ్లలో మోదీ తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమే. గాడిద గుడ్డు తెచ్చిన వాళ్లకు తెలంగాణ ప్రజలు ఓట్లు వేయాలా? 43ఏళ్లుగా జీవన్ రెడ్డి పదవులకు వన్నె తెచ్చారు. కానీ ఏనాడు పదవిని అడ్డు పెట్టుకుని అవినీతికి పాల్పడలేదు. నిజామాబాద్ ఎంపీగా జీవన్ రెడ్డిని గెలిపించి.. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా చేసుకుందాం. జీవన్ రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించండి" అని పిలుపునిచ్చారు .రేవంత్ రెడ్డి కేసులకు భయపడేటోడు కాదు. నాకు మద్దతుగా తెలంగాణ ప్రజలు ఉన్నారు. 50లక్షల మంది యువత ఉన్నారు. ఇలాగే వ్యవహరించిన కేసీఆర్ ను అసెంబ్లీలో ఎన్నికల్లో ప్రజలు 100 మీటర్ల గోతి తీసి బొంద పెట్టారు. ప్రధానిగా వ్యవహరిస్తే మోదీని గౌరవిస్తా. కానీ, గుజరాత్ ఆధిపత్యం ప్రదర్శించి తెలంగాణను అవమానిస్తే ఎదిరించి నిలబడతాని పేర్కొన్నారు.

## కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై నిషేధం..

### - ఈసీ కీలక ఆదేశాలు.. ఎప్పటివరకంటే..




**.టీ మీడియా, మే 1,హైదరాబాద్ :**తెలంగాణలో కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై 48 గంటలు నిషేధం విధించింది ఈసీ. సిరిసిల్ల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పై అవమానకరంగా, అభ్యంతరకరమైన పదజాలాన్ని ఉపయోగించినందుకు ఈసీ కేసీఆర్ ప్రచారంపై వేటు వేసింది. ఈరోజు రాత్రి 8 గంటల నుంచే ఈ నిబంధన అమలులో ఉండనున్నట్లు ఈసీ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈసీ సీరియస్ అయింది. గత నెల ఏప్రిల్ 6న కేసీఆర్ సిరిసిల్లలో నిర్వహించిన ప్రెస్ మీట్లో కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై తగు చర్యలు తీసుకోవాలని ఈసీని ఆదేశించింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన రాష్ట్ర ఎన్నికల అధికారి మే 1 రాత్రి 8 గంటల నుంచి 48 గంటల పాటు ప్రచారం నిర్వహించకూడదని కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈసీ ఆదేశాల ప్రకారం మే 3వ తేది రాత్రి 8 గంటల వరకు కేసీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు అనుమతి ఉండదు. దేశ వ్యాప్తంగా లోక్ సభ, పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో దేశం మొత్తం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ స్పష్టం చేసింది.

### ఈసీ ఆదేశాలపై కేసీఆర్ స్పందన..

ఈసీ తన లోకసభ ఎన్నికల ప్రచారాన్ని నిషేధించడంపై స్పందించారు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఈసీ స్థానిక మాండలికాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయిందన్నారు. ఇంగ్లీష్ ట్రాన్స్లేషన్ బాగా చేయలేదన్నారు. కాంగ్రెస్ కొన్ని పదాలను తప్పుగా వక్రీకరించి ఈసీకి ఫిర్యాదు చేసిందన్నారు. కేసీఆర్. తన బస్సుయాత్ర చూసి కాంగ్రెస్, బీజేపీ భయపడుతున్నాయన్నారు.

## తెలంగాణలో నిప్పుల వాన..!



**టీ మీడియా,మే1,,హైదరాబాద్ :** తెలంగాణలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం నుంచే ఎండలు మండుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఎండలకు తోడు వడగాలులు వీస్తుండడంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. బుధవారం జగిత్యాల జిల్లా జైనాలో 46.2, నల్గొండ జిల్లా మాడుగులపల్లిలో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అల్లీపూర్ (జగిత్యాల) 46.1, కొత్తగట్టు (కరీంనగర్) 46, కోల్వాయి (జగిత్యాల) 46, వీణవంక 46, దూల్‌మిట్ట (సిద్దిపేట) 45.9, వెల్గటూరు (జగిత్యాల) 45.9, తెల్దేవరపల్లె 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ వివరించింది. ఇదిలా ఉండగా.. రాగల ఐదురోజుల పాటు రాష్ట్రంలో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 2న కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో దీర్ఘకాల వడగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను ప్రకటించింది. 3న నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక వడగాలులు వీస్తాయని పేర్కొంది. 4న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## మణిపూర్‌లో మహిళల నిరసన.. గాల్లోకి కాల్పులు



**టీ మీడియా,మే01,బిష్ణుపూర్ :** మహిళా నిరసనకారులను చెదరగొట్టేందుకు సైనికులు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినప్పటికీ మహిళలు వెనక్కి తగ్గలేదు. తమ వర్గానికి చెందిన పురుషులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అల్లర్లు, హింసాత్మక సంఘటనలతో రగులుతున్న మణిపూర్‌లో ఈ సంఘటన జరిగింది. బిష్ణుపూర్ జిల్లాలో పోలీస్ యూనిఫాం ధరించిన 11 మంది సాయుధ వ్యక్తులను పెట్రోలింగ్ చేస్తున్న ఆర్మీ సిబ్బంది గుర్తించారు. ఆ వ్యక్తులను నిర్బంధించి వారి నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ విషయం తెలిసిన స్థానిక మహిళలు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆర్మీ వాహనాలను చుట్టుముట్టారు. తమ వర్గానికి చెందిన సాయుధ వ్యక్తులు గ్రామ రక్షణ వాలంటీర్లని తెలిపారు. వారిని నిరాయుధులను చేస్తే తమ గ్రామంపై ఇతర వర్గం వారు దాడి చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ వారిని విడుదల చేయాలని, స్వాధీనం చేసుకున్న ఆయుధాలను అప్పగించాలని డిమాండ్ చేశారు. అయితే మహిళలను చెదరగొట్టేందుకు సైనికులు గాల్లోకి కాల్పులు జరిపారు. మహిళలు వెనక్కి తగ్గకపోవడంతో గందరగోళం నెలకొన్నది. మరోవైపు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిరసనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. చివరకు నిర్బంధించిన వ్యక్తులను విడిచిపెట్టారు. అయితే స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో ఆర్మీ సిబ్బంది, పోలీసులు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. అనంతరం మహిళలు అక్కడి రహదారిని దిగ్బంధించారు.





## తెలంగాణలో పోలింగ్ సమయం పెంపు..

### -ఈసీ కీలక ఆదేశాలు.. ఎందుకంటే..

**టీ మీడియా, మే 1,హైదరాబాద్ :**తెలంగాణ పోలింగ్?లో పాల్గొనే వారికి గుడ్ న్యూస్ చెప్పింది సీఈసీ. తెలంగాణ రాష్ట్రంలో పోలింగ్ సమయాన్ని పెంచింది సెంట్రల్ ఎలక్షన్ కమిషన్. తాజాగా ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని ప్రకటించింది. సాధారణంగా పోలింగ్ నిర్వహించే సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా తాజాగా ఒక గంట సమయాన్ని పొడిగిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ ఉక్కపోతలతో, ఎండ తీవ్రతకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. దీనిపై వాతావరణ శాఖ కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది.మే నెల మొత్తం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని కీలక ప్రకటన చేసింది. పైగా సమ్మర్ కారణంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఆసక్తిగా ఓటు వేసే వారికి ఈ ఎండలు కాస్త ఇబ్బందికి గురిచేస్తుందని గుర్తించిన ఎన్నికల అధికారులు పోలింగ్ సమయాన్ని పెంచినట్లు తెలుస్తోంది. అలాగే సమ్మర్ కారణంగా పోలింగ్ సమయాన్ని పెంచాలని పలు రాజకీయ పార్టీలు ఈసి కి వినతి పత్రాన్ని అందించినట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీల ఫిర్యాదు మేరకు పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పెంచినట్లు ఈసీ స్పష్టం చేసింది. మామూలు రోజుల్లో సాయంత్రం 5 గంటల వరకు క్యూ లైన్లలో నిలుచున్న వారికి మాత్రమే ఓటు హక్కును కల్పించే పోలింగ్ అధికారులు తాజాగా ఈసీ తీసుకున్న నిర్ణయంతో సాయంత్రం 6 గంటల వరకు క్యూ లైన్లలో నిలుచున్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నారు.

# వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మరింత దగ్గర అవుతాం

## -మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**టీ మీడియా,మే1,నల్గొండ:** తెలంగాణ రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ రాబోతోందని ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వార్డుకో వాలంటీర్ వ్యవస్థ వ్యవస్థ రాబోతుందని. దీని ద్వారా ప్రజలకు మరింత దగ్గర అవుతావుతామని ఆయన చెప్పారు. నల్గొండ పట్టణంలోని ఎమ్ఎన్ఆర్ గార్డెన్ లో బుధవారం జరిగిన నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీనియర్ నేత జానారెడ్డి, నల్గొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డితో కలిసి మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేయకపోతే దేనికైనా సిద్ధమేనని ప్రకటించారు. దేశంలో సంకీర్ణ ప్రభుత్వం రాబోతుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతున్నారని జోస్యం చెప్పారు.

### అగ్గిపెట్టె రావు మళ్లీ వస్తున్నారు

పదేళ్లలో లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో జనం ఓడించారని.. అగ్గిపెట్టె రావు మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని అన్నారు. 26 వేల కోట్ల రూపాయల కాళేశ్వరం లోన్ అభాసుపాలయ్యిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కేసీఆర్, కేటీఆర్ మానసిక పరిస్థితి దిగజారి పోయిందని.. బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసిలో వేసినట్టేనని పేర్కొన్నారు. నీటి కరువుకు కారణం బీఆర్ఎస్ పార్టీయేనని.. 2004లోనే 33 కిలోమీటర్ల ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తే కేసీఆర్ ఆ ప్రాజెక్టు పక్కన పెట్టారని ఆరోపించారు. మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీయిచ్చారు. హైదరాబాద్ %-% విజయవాడ జాతీయ రహదారిని ఆరులేన్లుగా 3 నెలల్లో మొదలు పెట్టనున్నామని వెల్లడించారు. 4 నెలల్లోనే వెయ్యి కోట్లు నిధులు తెచ్చానని.. రూ.700 కోట్లతో నల్గొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరగబోతుందన్నారు.జానారెడ్డి అదృష్ట వంతుడని.. ఒక కొడుకు ఎమ్మెల్యే అయ్యాడు, మరో కొడుకు భారీ మెజార్టీతో ఎంపీగా గెలువబోతున్నారని మంత్రి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. గుత్తా అమిత్ రెడ్డికి మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని, పార్టీలో నాయకులందరికీ సముచిత గౌరవం ఉంటుందని భరోసాయిచ్చారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి అనారోగ్య కారణాలతో మీటింగ్‌కు హాజరు కాలేకపోయారని చెప్పారు. "సీఎం వద్ద ఏ పని కావాలన్నా నేను చేసుకొస్తా.. భారీ మెజార్టీ మీరు ఇవ్వండి" అంటూ నల్లగొండ ప్రజలను కోరారు.

**కోమటిరెడ్డి అంటేనే కార్యకర్తలు :** కాంగ్రెస్ కార్యకర్తల కోసం తన ప్రాణాలైన ఇస్తానని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించారు. "గల్లీ నుంచి నన్ను ఢిల్లీ వరకు పంపిన మీకు నా చర్మం వలిచి చెప్పులు కుట్టించినా తక్కువే. కార్యకర్తలు అంటేనే కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. కోమటిరెడ్డి అంటేనే కార్యకర్తలు. నాకు కొడుకు లేడు.. మీరే నా వారసులు. పేద పిల్లల చదువు బాధ్యత ప్రతీక్ ఫౌండేషన్ తీసుకుంటుంద"ని అన్నారు.



## ఘనంగా "మేడే"

**టీ మీడియా, మే1, గోదావరిఖని ప్రతినిధి:** మేడే సందర్భంగ రామగుండం కార్పొరేషన్ పరిధి గోదావరిఖని లోని ఆర్ ఎఫ్ సి ఎల్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, అమాలి ప్రభుత్వ హాస్పిటల్ అలాగే భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన జెండా ఆవిష్కరించి 138వ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ అమెరికలోని చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం హేమార్కెట్ వద్ద జరిగిన నిరోచిత పోరాటం ఫలితంగా 8 గంటల పని దినాన్ని సాధించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ పోరాటంలో నలుగురు కార్మికులు ఉరి తీయబడ్డారని అన్నారు పోలీస్ కాల్పుల్లో మరి కొంతమంది మరణించారని, కార్మికుల రక్తంతో తడిచిన గుడ్డనే ఎర్రజెండా అయ్యిందని పేర్కొన్నారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 10 నుంచి 12 గంటలు పెంచుతున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు నెలకు 26,000 ఇవ్వాలని అంటే నెలకు సుమారు రూ 4628 ఉంటే సరిపోతుందని చట్టం చేశారని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిగా బిజెపి ప్రభుత్వం ఉపాధిని కోల్పోయేలా చేస్తుందని అన్నారు 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా తెచ్చి కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. పోరాడి కార్మికులు సాధించుకున్న హక్కులు పొందాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వమును గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివ, సంజీవ్ ,సతీష్, కృష్ణ, బాలకృష్ణ, నరేష్, ఉపేందర్, కొమురయ్య, రాజేశ్వరి, మల్లయ్య, సాగర్, శివలతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం నింపుతూ వైద్య సేవలు అందించాలి

**టీ మీడియా, మే 1, వనపర్తి బ్యూరో :** గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో గల జిల్లా పాలియేటివ్ కేంద్రంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా జయచంద్ర మోహన్ సందర్శించి అక్కడ రోగులతో మమైకం అవుతు ఇక్కడ అందుతున్న వైద్య సేవల గురించి అడుగుతూ సెంటర్ల ఉన్న సిబ్బంది తో సమీక్ష నిర్వహించి వయొవృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, సమయపాలన పాటించి,పేషంటలకు మంచి ఆరోగ్య అలవాట్లు గురించి అవగాహన కార్యక్రమాలు చేయాలని సూచించారు. ప్రత్యేకించి క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం నింపుతు వైద్య సేవలు అందించాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో పాలియేటివ్ కేర్ డాక్టర్ దీపిక, ఫీజియెథెరపి డాక్టర్లు మారుతి, స్వప్న కో ఆర్డినేటర్ మహేశ్వర చారి సాఫ్ట్ పాల్గొన్నారు.



## టాపర్ విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు

**టీ.మీడియా,మే,1,ఆత్మకూరు:** మున్సిపాలిటీ కేంద్రంలో విశ్వ భారతి హై స్కూల్ లో పదవ తరగతి పరీక్ష ఫలితాలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కే.అక్షయ 10/10 ను మక్తల్ శాసనసభ్యులు శ్రీ వాకిటి శ్రీహరి గారు విద్యార్థిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు విశ్వ భారతి హై స్కూల్ కరస్పాండెంట్ చంద్రయ్య మరియు ప్రిన్సిపల్ బాల్ రాజ్ ను యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర కల్లుగీత శాఖ. కేశం నాగరాజు గౌడ్.ఎండి రహమతుల్లా. రాయచూరు పరమేష్.నల్గొండ శీను. మణి వర్ధన్ రెడ్డి. మచ్చేందర్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.



## నీటి కష్టాలు తీర్చండి

**టీ మీడియా, మే01, మహానంది:**
మహానంది మండలం బుక్కాపురం గ్రామపంచాయతీలో నీటి కష్టాలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపా. గత కొన్ని రోజులుగా గ్రామంలోని బోరుబావులలో నీటి మట్టం తగ్గడంతో పాటు, బోర్లలో మోటర్లు పనిచేయకపోవడంతో గ్రామంలో నీటి కష్టాలు పెరిగాయని, దీనితో గ్రామస్తులు స్వయంగా నీటి ట్యాంకర్ ను ఏర్పాటు చేసుకుని, వ్యవసాయ పంప్ సెట్ వద్ద నుంచి తెచ్చి నీరు అందిస్తున్నారని. అధికారులకి తెలియజేసిన, స్పందించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కోడలి గొంతు కోసి చంపిన మామ

**టీ మీడియా, మే 1,జగిత్యాల:** జిల్లా అనుమానంతో కోడలిని మామ గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటన జగిత్యా ల జిల్లా సారంగాపూర్ మండలంలో ఉదయం చోటు చేసుకుంది. రేచపల్లి గ్రామానికి చెందిన వివాహితను ఆమె మామ ఆకుల రాజిరెడ్డి బుధవారం తెల్లవారుజామున హత్య చేసినట్లు తెలుస్తుంది. మృతురాలి భర్త తిరుపతి రెడ్డి ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు. అయితే కోడలికి అక్రమ సంబంధం ఉందనే అను మానంతోనే మామ హత్య చేసినట్లు స్థానికులు అను మానం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



## ఏప్రిల్ మాసం ఉత్పత్తిని ప్రకటించిన ఆర్ ఎఫ్ సి ఎల్

**టీ మీడియా, మే1, గోదావరిఖని ప్రతినిధి:**
రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో ఏప్రిల్- 2024 ఉత్పత్తులను ఆర్ ఎఫ్ సి ఎల్ సి జి ఎం సుధీర్ కుమార్ ఝా ప్రకటించారు. దేశంలో ఎరువుల కొరతను తీర్చేందుకు కేంద్ర ,రాష్ట్ర భాగస్వామ్యంతో రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. 2021 మార్చ్ 22న కర్మాగారంలో పూర్తిస్థాయిలో ఉత్పత్తులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ప్లాంట్లో ఉత్పత్తి అయిన నీమ్ కోటెడ్ యూరియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర,తమిళనాడు, ఛత్తీస్‌గఢ్,మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నాము అన్నారు.




ఏప్రిల్ - 2024 లో కర్మాగారం 114002.82 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశామన్నారు. ఇందులో తెలంగాణకు 35332.65 మెట్రిక్ టన్నులు, ఆంధ్ర ప్రదేశ్ కు 8407.98 మెట్రిక్ టన్నులు, కర్ణాటక కు 20319.75 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్ర కు 14649.12 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్ కు 13526.37 మెట్రిక్ టన్నులు, తమిళనాడు కు 13520.43 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్ కు 8246.52 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా, సంస్థ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని మరియు 114002.82 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని సాధించటంలో కీలకపాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులకు %=ఖీజా% ముఖ్య కార్య నిర్వహణ అధికారి అభినందనలు తెలిపారు. అలాగే సంస్థకు మద్దతుగా ఉన్న రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి, కేంద్ర ఎరువులు, రసాయనాలు మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్లయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

### -ఆర్థిక సహాయం అందజేత



**టీ మీడియా మే 1.జిన్నారం:** మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న రాత్రి మరణించిన కరుడుగట్టిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంది ఎల్లయ్య మరణించడం జరిగింది.. ఎల్లయ్య మరణ వార్తను తెలిసి జిన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీపీ రవీందర్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ వైస్ ఎంపీపీ గంగు రమేష్ పోతారం ఎంపీటీసీ జనాభాయ్ జిన్నారం ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్ శివనగర్ ఎంపీటీసీ సంతోష మహేష్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్ మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోటేష్ గౌడ్ గోకర వెంకటేష్ మల్లేష్ యాదవ్ నాగారం యాదగిరి కృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కలిసి కంది ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి ఎల్లయ్య అంత్యక్రియలు కాంగ్రెస్ పార్టీ తరపున చేయించాలని ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కంది ఎల్లయ్య సేవలు మరువలేమని వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది.

## ఘనంగా మే డే వేడుకలు

### - రిటైర్డ్ కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

**టీ మీడియా, మే 1, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో మేడే సందర్భంగా బుధవారం ఐ ఎన్ టి యు సి ఆఫీస్ వద్ద చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ జెండా ఆవిష్కరించి, రిటైర్డ్ కార్మికులను సన్మానించడం జరిగింది.అనంతరం12 వ వార్డ్ బిఆర్ఎస్ కౌన్సిలర్ బొద్దుల రమ, ప్రేమ్ సాగర్ లను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అలాగే ఏఐటియుసి సెంట్రల్ సెక్రటరీ అక్బర్ ఆలీ ఆధ్వర్యంలో ఆర్కేపి ఏఐటీయూసీ బ్రాంచ్ ఆఫీస్,ఆర్కెపి సి హెచ్ పి,ఆర్కెపి ఓ సి ,సివిల్ డిపార్ట్మెంట్, మహాలక్ష్మి ఓబి లలో ఘనంగా కార్మికుల దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు,వేజ్ బోర్డ్ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య సిహెచ్ పి లో కార్మికుల జెండాను ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని,కార్మిక చట్టాలను కాపాడుకోవాలని,కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని,ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం బొగ్గుగనుల ప్రైవేటీకరణ చేస్తుందని,కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని , ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు,ఫిట్ కమిటీ సభ్యులు, ఆర్కేపి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## నీటి ఎద్దడి నివారణకు దేవస్థానం సహకారం మంచినీటి బోరు ఏర్పాటు

### -ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి

**టీ మీడియా, మే1, మహానంది:**
మహానంది మండలంలో నీటి ఎద్దడి నివారణ కోసం మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మానవత్వంతో స్పందించారు. బుధవారం నుంచి మహానంది దేవస్థానం గోశాలకు సమీపంలో ఉన్న బోరు నుంచి,ట్యాంకుల ద్వారా నీటిని పట్టుకొని వెళ్లేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చి నీటిని పట్టుకొని వెళ్లేందుకు చేపట్టిన ఏర్పాట్లపై, స్థానికులతో పాటు పలు గ్రామాల్లోని ప్రజలు ఈవో చర్యలపై అభినందనల వర్షం కురిపిస్తున్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.




## టీ మీడియా దినపత్రిక కథనానికి స్పందన నీటి సమస్య పరిష్కారం

**టీ మీడియా,మే01, మహానంది:** మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని గుండంపాడు వెళ్లే రస్తా యందు సుందరయ్య నగర్లో అధికారులు నీటి సమస్యను పరిష్కరించారు. ఏప్రిల్ 24వ తేదీన సుందరయ్య నగర్ లో నీటి కష్టాలు తీర్చండి మహాప్రభో అనే టీ మీడియా దినపత్రికలో శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.నీటి సమస్య రావడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. దాదాపు మూడు నెల రోజులుగా చుక్క నీరు లేక ఇబ్బంది పడుతున్నామని, అక్కడ ఉన్న చేతి పంపు బోరింగ్ల రెండు బోర్లు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో, నీరు రావడంలేదని, వ్యవసాయ బోర్ల నుండి నీరు తెచ్చుకుంటున్నట్లు తెలిపారు.నీటి సరఫరా నిలిచిపోయిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్ స్పందించి, చేతి పంపు బోరింగుకు మరొక మోటర్ ఏర్పాటుచేసి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ప్రజల నీటి సమస్య తీరింది. ఈ సందర్భంగా మండల అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



## లక్ష్యాన్ని అధిరోహించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలి

### -సానియా ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు



**టీ మీడియా, మే 1, వనపర్తి బ్యూరో :** ఎంచుకున్న లక్ష్యాన్ని అధిరోహించి వనపర్తి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ అక్తర్, పట్టణ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు హనీఫ్ కోరారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన సానియా అనే విద్యార్థిని ఇంటర్ ఒకేషనల్ లో 1000/960 మార్కులు సాధించి వనపర్తి టౌన్ ఫస్ట్ గా నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం వారు సానియాను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి, పట్టుదలతో చదువుకొని అందరికీ ఆదర్శంగా నిలవాలని వారు ఆకాంక్షించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చని వారు గుర్తు చేశారు.

## హమాలీల సమస్యపై పోరాటం చేసిన ఐక్యవేదిక

### మేడే రోజున స్పందించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి ధన్యవాదాలు తెలిపిన అఖిలపక్ష ఐక్యవేదిక



**టీ మీడియా, మే 1, వనపర్తి బ్యూరో :** గత వారంలో రోజులుగా గంజి దగ్గర ఉండే బజారు హమాలీలు తమ సమస్యలపై అఖిలపక్ష ఐక్యవేదికను సంప్రదించగా, రెండు రోజుల క్రితం వారి వద్దకు వెళ్లి వారి సమస్యలను పత్రిక ముఖంగా ఎమ్మెల్యేకు జిల్లా కలెక్టర్ కి విన్నవించడం జరిగింది. బుధవారం మేడే సందర్భంగా హమాలీలతో సమావేశమైన అఖిలపక్ష ఐక్యవేదిక సభ్యుల దగ్గరకు ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే రావడం జరిగింది. వారి సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే ఎలక్షన్ కోడ్ ఉన్నందున ఆ సమస్యలపై వచ్చే నెల నాలుగు తర్వాత స్పందిస్తానని తెలపడం జరిగింది. హమాలీ సంఘం నాయకులు, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, నాయకులు శివకుమార్, బొడ్డుపల్లి సతీష్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్లు బ్రహ్మచారి, వెంకటేష్ తదితరులు మళ్లీ ఒకసారి ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యలపై తీసుకువస్తామని చెప్పడం జరిగింది.

## ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి మారదా




**టీ, మీడియా, మే, 1, ఆత్మకూరు:** మున్సిపాలిటీ కేంద్రంలో అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ ఆసుపత్రి పనితీరు.ఆసుపత్రికి వెళ్లే రోగులకు కనీస వసతులు లేక రోగులు నానా అవస్థ వ డు తు న్నా రు. ఎన్ని ప్రభుత్వాలు మారిన వైద్య నిర్వాహణలో ఎలాంటి మార్పులు జరగలేదని, అటు ప్రభుత్వ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకో పోవడంతో పేద ప్రజలకు అనారోగ్యం వస్తే ప్రభుత్వాసుపత్రికి పోవడం కన్నా చావే మేలు అనుకుంటున్నారు.కుక్క కాటుకు వేసే వ్యాక్సిన్ కూడా బయట నుంచి కొనుక్కొని వేయించుకునే దుస్థితి ఏర్పడింది.కొన్ని సందర్భాల్లో బీపీ మెషిన్ అందుబాటులో లేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటూ కూడా, ప్రభుత్వ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితిని మార్చాలని, పట్టణ ప్రజలు,చుట్టుపక్కల గ్రామస్తులు వాపోయారు.

## చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్

**టీ మీడియా, మే01, మహానంది:**
రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే .శ్రీనివాసులు సూచించారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామ పరిధిలోని ఆంజనేయ పురం అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద కలెక్టర్ తనిఖీలను పరిశీలించి,తనిఖీలు చేసి వాహనాలను నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాహనాలను విస్తృత తనిఖీలు చేపట్టి అక్రమంగా నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపించాలన్నారు. విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం వుంటే సంబంధిత అధికారులు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ సర్వైవ్ టీమ్ హెడ్,డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## ఏపీ సహా 10రాష్ట్రాల్లో సీబీఐ దాడులు




**టీ మీడియా,మే01,ఢిల్లీ:** ఆన్‌లైన్‌లో మోసపూరిత యాప్‌లపై దర్యాప్తు సంస్థలు కొరడా ఝుళిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హెచ్‌పీజెడ్ టోకెన్ యాప్ (పెట్టుబడి పేరుతో మోసానికి పాల్పడిన కేసులో సీబీఐ దేశవ్యాప్తంగా దాడులు జరిపింది. 10 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో 30 చోట్ల సోదాలు చేసినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ సహా ఢిల్లీ, రాజస్థాన్, యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ దాడులు జరిపినట్లు సీబీఐ ప్రకటించింది.ఢి హెచ్‌పీజెడ్ టోకెన్ యాప్ మోసంలో పాత్ర ఉందన్న ఆరోపణలపై షిగూ టెక్నాలజీ ప్రై.లిమిటెడ్, లిలియన్ టెక్నోక్యాబ్ ప్రై.లిమిటెడ్ కంపెనీలు సహా ఆయా సంస్థల డైరెక్టర్లపై సీబీఐ ఇదివరకే కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగా పది రాష్ట్రాల్లో మంగళవారం రాత్రి వరకు దాడులు జరిపి ముఖ్యమైన డిజిటల్ ఆధారాలను సీజ్ చేసింది. ఈ మెయిల్‌లతోపాటు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌లు, సిమ్ కార్డులు, ఏటీఎం/డెబిట్ కార్డులు, ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. పెట్టుబడిదారుల నుంచి నిధులను సేకరించేందుకు నిందితులు దాదాపు 150 బ్యాంకు అకౌంట్లను ఉపయోగించినట్లు సీబీఐ గుర్తించింది. క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ మైనింగ్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా భారీ లాభాలు వస్తాయంటూ ఈ రెండు సంస్థలు వినియోగదారులను ప్రలోభపెట్టాయని సీబీఐ పేర్కొంది.

## దిశా ఎన్‌కౌంటర్.. పోలీసులకు బిగ్ రిలీఫ్




**టీ మీడియా,మే1,హైదరాబాద్ :** దిశా నిందితులను ఎన్ కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది కమిషన్. అయితే, సిర్పూర్ కమిషన్ నివేదిక.. దిశా నిందితుల ఎన్ కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సిర్పూర్ కర్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. సిర్పూర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారులపై చర్యలు తీసుకోవద్దని చెప్పింది.సిర్పూర్కర్ కమిషన్ నివేదికపై హైకోర్టును ఆశ్రయించారు ఏడుగురు పోలీసు అధికారులు, షాద్ నగర్ తహసిల్దార్. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. వాళ్ళపై చర్యలు తీసుకోవద్దంటూ స్టే విధించారు జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి.దిశా నిందితుల ఎన్ కౌంటర్ పై సిర్పూర్ కర్ కమిషన్ ను సుప్రీంకోర్టు నియమించిన సంగతి తెలిసిందే. క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు పలువురిని విచారించింది సిర్పూర్ కమిషన్. దిశా నిందితులను ఎన్ కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది కమిషన్. అయితే, సిర్పూర్ కమిషన్ నివేదిక సరిగ్గా లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు పోలీస్ అధికారులు. సిర్పూర్ కమిషన్ నివేదికపై హైకోర్టు సింగిల్ బెంచ్ ను ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం సిర్పూర్ కర్ కమిషన్ నివేదికపై విజయసేన్ రెడ్డి బెంజ్ స్టే విధించింది. దీంతో పోలీసు అధికారులకు రిలీఫ్ దక్కింది.



## ఘనంగా అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం

**టీ మీడియా, మే 1, వనపర్తి బ్యూరో :** వనపర్తి ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు గంగురెడ్డి మాధవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం కార్యక్రమం ఐఎన్టియుసి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఐఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులుగా బుద్దారం మురారి , వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ హాజరయ్యారు.వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులు తెల్లవారుజామున లేచి చెత్త సేకరించి, రోడ్లను శుభ్రపరిచి ప్రజల ఆరోగ్యం, శుభ్రత చేయడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నారు. వీరిని పర్మినెంట్ ఉద్యోగులగా, కనీస వేతనాలను పెంచలన్నారు. కరోనా సమయంలో మున్సిపాలిటీ ఉద్యోగుల పాత్ర ముఖ్యమైనది అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ , ఐఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు,ఐఎన్టియుసి వనపర్తి మహిళ జిల్లా అధ్యక్షులు గిరిజా దేవి,ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, మత్స్య కార్మిక జిల్లా అధ్యక్షులు నందిమల్ల యాదయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొంకి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దివాకర్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు రోహిత్, సేవాదళ్ జానకి రాములు, మండల అధ్యక్షులు గణేష్ గౌడ్,పెంటన్న యాదవ్ , నారాయణ, రాములు యాదవ్, జమాల్, జిల్లా సీనియర్ నాయకులు బి కృష్ణ, బాబా, ప్రవీణ్ రెడ్డి, దిలీప్,అమరచింత అరుణ్ కుమార్, అమరచింత పట్టణ %దీజ% సెల్ విష్ణు, అమరచింత ఐఎన్టియుసి మండలం బాలరాజు,అబ్దుల్లా, ఇర్షాద్, కుమార్, ఎల్లయ్య,జానంపేట నాగరాజు, ఆత్మకూరు కృష్ణ దాసు, అమరచింత మసీకొండ,సంజీవ్ సాగర్, గడ్డం వినోద్ పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, సందీప్, కార్తీక్, మహేష్, రమేష్,రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### ౦ డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్



**టీ మీడియా, మే1, వనపర్తి బ్యూరో :** కార్మికులు,కర్షకులు ఎదుర్కొంటోన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి, కార్మికులకు న్యాయం చేస్తానని నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ హామీ ఇచ్చారు. మేడే సందర్భంగా వనపర్తిలోని రాజీవ్ చౌక్ లో భవన నిర్మాణం, ఆటో, హమాలీ,ఆటో డ్రైవర్స్,స్ట్రీట్ వెండర్స్, రైతు కూలీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులు ఐక్యతతో ఉండాలని,తనను ఎంపీగా గెలిపిస్తే కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓట్ల కోసం ఆరు గ్యారంటీల అమలు పేరుతో నిండా ముంచిన కాంగ్రెస్ ను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులకు అధికారం రాగానే జనాలను మోసం చేసే పనిలో ఉన్నారన్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు రూ.12,000 ఆర్థిక సాయం ఇస్తానన్న హామీ అమలు కావడం లేదన్నారు.కాంగ్రెస్ హాయంలో కార్మికులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంలేదన్నారు. కాంగ్రెస్, బిజెపిలకు కార్మిక,కర్షక లోకం సమస్యలు పట్టవని విమర్శించారు. కార్మికుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించి, వారి ఆరోగ్యాన్ని కాపాడేలా కృషి చేసి, నిరంతరం పర్యవేక్షించే ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు.తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల గొంతుగా ఉండి ప్రజా సమస్యలపై పార్లమెంటులో పోరాడుతానన్నారు.మోదీ గ్యారంటీలతో పేదలకు ఒరిగేది ఏమీ లేదు.

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ**

మోదీ గ్యారెంటీలు వేల కోట్ల ప్రజాధనాన్ని అదానీ,అంబానీలకు కట్టబెట్టడానికి ఉపయోగపడుతుంది తప్ప, కార్మికులు,కర్షకులకు ఒరిగేది ఏమీ లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మోదీ పాలనలో పేదల బతుకులు ఛిద్రం అయ్యాయని అన్నారు.కార్మిక కర్షక లోకానికి మోడీ చేసింది ఏమీ లేదన్న ఆయన, బిజెపిని గెలిపిస్తే కార్మిక లోకం తీరని అన్యాయానికి గురవుతుందన్నారు.

కేసీఆర్ హయంలో కార్మికుల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. వ్యవసాయ రంగంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానం ఉందన్నారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో కార్మికులకు న్యాయం చేసిన పార్టీ భారాసను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని,వరికి రూ.500 రూపాయల బోనస్ ఇస్తామన్న హామీ నెరవేరలేదన్నారు. పెన్షన్లు రూ.4,000 లకు పెంచుతామని, కళ్యాణ లక్ష్మీ కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీలన్నీ అటకెక్కాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్,వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,నాగర్ కర్నూల్ పార్లమెంట్ మీడియా ఇంచార్జి అభిలాష్ రావు, నాయకులు వాకిటి శ్రీధర్,లక్ష్మయ్య, విజయ్ కుమార్,నందిమల్ల అశోక్, ఉంగ్లమ్మ.తిరుమల్,గంధం. బాలపేరు,గంధం.పరంజ్యోతి,మాణిక్యం, ధర్మా ,మహేశ్వర రెడ్డి కౌన్సిలర్ కంచె.రవి,నాగన్న యాదవ్,బండారు.కృష్ణ,గడ్డం మహేస్,సూర్యావంశం.గిరి, జో హే బ్ హస్సెన్, చిట్యాల.రాము తదితర నాయకులు పాల్గొన్నారు.



## ప్రకృతికి 'మెగా' పాతర

- -సొంత క్రషర్లతో కాలుష్యం
- -బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు బీటలు
- -ప్రాణాలుపోతున్నా పట్టని వైనం
- -బాధిత గ్రామాల ఆందోళన



**టి మీడియా, మే1 ,శ్రీకాళహస్తి/తొట్టంబేడు :** జాతీయ రహదారి పనుల విస్తరణ పేరిట ప్రముఖ మెగా సంస్థ ప్రకృతిపై పగబట్టింది. భూగర్భ వనరులను కొల్లగొడుతోంది. ఆ సంస్థ స్వార్థానికి చెరువులు, భూములు, రహదారులు ఛిద్రమవుతున్నా, అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా మొండిగా ముందుకే వెళ్తుంది. నాయుడుపేట–తిరుపతి మార్గంలో జాతీయ రహదారిని పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చన్న మానవతా దృక్పథంతో ప్రజలు తమ భూముల్లో, చెరువుల్లో మట్టిని, గ్రానైట్‌ను తవ్వుకునేందుకు అవకాశమిచ్చినందుకు వారి ప్రాణాలకే ఎసరు పెట్టింది. పరిమితికి మించి తవ్వకాలు, బ్లాస్టింగుల వల్ల పర్యావరణానికి పెనుముప్పు కలిగిస్తోంది. ప్రశ్నించే వారిపై అధికార బలంతో ఉక్కుపాదం మోపుతోంది. మెగా సంస్థ అక్రమాలకు హద్దూ అదుపూ లేకుండా పోతోంది. మెగా యాజమాన్యానికి స్థానిక అధికార పార్టీ నేతల అండ, పోలీసుల, ప్రభుత్వ యంత్రాంగం ఆశీస్సులు మెండుగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### సొంత క్రషర్లు, క్వారీలు, తారు ప్లాంట్లతో కాలుష్యం

నాయుడుపేట– మదనపల్లి జాతీయ రహదారిని 170 కిలోమీటర్ల మేర విస్తరించే సమయంలో మెగా సంస్థకు రాయి, మట్టి, కంకర, గ్రానైట్, తారు తదితరాల అవసరం ఉంది. రహదారి అంచనా వ్యయం సుమారు రూ.5 వేల కోట్లులోనే వీటన్నింటినీ నమకూర్చు కోవాలి. మెగా సంస్థ రైతుల వద్ద బలవంతంగా భూములు లాక్కుని తానే స్వయంగా తారు, క్రషర్, క్వారీలను జాతీయ రహదారికి సమీపంలోని గ్రామాల వద్ద ఏర్పాటు చేసుకుంది. దీంతో, సమీప ప్రజలకు, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి వద్ద ఆ గ్రామానికి అనుకునే సొంత తారు, క్వారీ, క్రషర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంది. నిత్యం తవ్వకాలు, బ్లాస్టింగులులతో లింగమనాయుడుపల్లితోపాటు సమీప గ్రామాల ప్రజలు కాలుష్యం బారినపడుతున్నారు. బ్లాస్టింగ్ల కోసం కంప్రెషర్లతో కాకుండా పవర్ బోర్లతో రంధ్రాలు వేస్తుండడంతో ఇళ్లల్లో వైబ్రేషన్లు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. లింగమనాయుడుపల్లి, కురవకనేరి, గుమ్మడిగుంట, క్రైస్తవమిట్ట, దొమ్మరపాళెం, తాటిపర్తి, మల్లిగుంట, రౌతు సూరమాల గ్రామాల్లోని పలు దాబా ఇళ్లు బ్లాస్టింగుల వల్ల బీటలు వారాయి. గాలి, నీటి కాలుష్యం కావడంతో దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలతో ఆయా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. లింగమనాయుడు పల్లిలో కలుషిత నీటి వల్ల పలువురు కిడ్నీ రోగాల బారినపడ్డారు. గడిచిన ఆర్నెల్లలో లింగమనాయుడుపల్లిలో రత్నయ్య, సురేంద్ర, వెంటకసుబ్బయ్య, లోకనాథంనాయుడు కిడ్నీ ఫెయిల్యూర్‌తో మృతి చెందారు. ముకుంద అనే బాలుడు ప్రాణాలు నిలుపుకునేందుకు ఆస్పత్రిలో పోరాడుతున్నాడు.

### బాధితుల నిరసన

వెంటనే పనులు ఆపాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ లింగమనాయుడుపల్లి, కురవకనేరి గ్రామస్తులు మంగళవారం మెగా ప్లాంట్ల వద్ద నిరసనకు దిగారు. కాలుష్యం వల్ల 30 ఏళ్లకే కిడ్నీలు, ఊపిరితిత్తులు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్ బోర్లతో డ్రిల్లింగ్, బాంబ్ బ్లాస్టింగుల వల్ల భూకంపం వచ్చినట్లు భయంతో గడుపుతున్నామని వాపోయారు. బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లన్నీ బీటలు వారాయనీ, రేపో మాపో కూలిపోయేలా ఉన్నాయనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా యాజమాన్యం నుంచి ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులను అడ్డుకున్నారు. నిరసన విరమించకుంటే కేసులు పెడతామని బెదిరించి వారితో బలవంతంగా ఆందోళన విరమింపజేశారు.



## భారీగా పేలుడు..

### నలుగురు మృతి

**టీ మీడియా, మే 1,విరుద్ నగర్ :** తమిళనాడులో విషాదం చోటు చేసుకుంది. విరుదునగర్ జిల్లా,కారి యాపట్టి గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతమైన అవియార్ క్వారీలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా.. మరో 12 మంది తీవ్ర గాయాలయ్యా యి. రాళ్లను పగులగొట్టేం దుకు ఉపయోగించే పేలుడు పదార్థాలను ఓ గదిలో ఉంచిన క్రమంలో ఈ పేలుడు సంభవించినట్లుగా తెలిసింది. క్వారీలో రాళ్ల నుంచి సిల్ట్, ఎమ్ ఇసుక మొదలైన పదార్థాలు విరిగిపోతాయి. ఈ క్రషర్‌లో రాళ్లను పగులగొట్టేందుకు శక్తివంతమైన పేలుడు పదార్థాలను ఉపయోగి స్తున్నట్లు తెలిసింది. బుధవారం ఉదయం క్వారీ సమీపంలోని ఓ గదిలో పేలుడు పదార్థాలు పేలినట్లు సమాచారం ఈ ప్రమాదం కారణంగా అటవీ ప్రాంతంలో అక్కడక్కడా కార్మికుల మృత దేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అలాగే, పేలుడు పదార్థాలు ఉన్న భవనం సమీపంలోని రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద ప్రాంతంలో పేలుడు పదార్థాలు ఉండడంతో సహాయక చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఈ పేలుడు సమయంలో కారియాపట్టి చుట్టుపక్కల ఉన్న ఇళ్లు దాదాపు 20 కి.మీ దూరం వరకు ప్రకంపనలతో దెబ్బతి న్నాయి.







## మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ పని చేయుటకు కావలెను

టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

తమ వివరాలు :

పేరు :..........................................................................

ప్రస్తుత నివాసం :..............................చదువు :..............................

సెల్ నెంబర్ :......................................................................